దినపత్రిక తొలి సమయం

మంగళవారం, 9 , జూన్, 2026

# పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలి

**- అఖిలభారత ఐక్య రైతు సంఘం తెలంగాణ ఉపాధ్యక్షులు పాయం చిన్న చంద్రన్న**



**తొలి సమయం, మహబూబాబాద్ జూన్ 8**

ఆరు గాలం కష్టపడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతుకు నష్టం తెచ్చే పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం() తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం చిన్న చంద్రన్న అన్నారు అన్నారు. కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా నేడు మహబూబాబాద్ జిల్లా అడిసినల్ కలెక్టర్ గారికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం చంద్రన్న మాట్లాడుతూ కల్తీ లేని విత్తనాలను,పురుగుమందులను రైతాంగానికి అందించాలని, కల్తీ విత్తనాలు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కచ్చితంగా శిక్షించాలని అన్నారు. యుద్ధం సాకుతో భారీగా పెరిగిన ఎరువుల ధరలతో రైతాంగం మరింత అప్పుల పాలయ్యే ప్రమాదం ఉందని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు సబ్సిడీలు రుణమాఫీలు అప్పుల రద్దు చేస్తూ దేశానికి అన్నం పెడుతున్న రైతుబండించే పంటకు అవసరమా ఎరువుల ధరలు భారీగా పెంచడం సిగ్గుచేటు అన్నారు. రైతులకు అవసరమగు పంట రుణాలను సకాలంలో అందించి ప్రైవేట్ అప్పుల బారిన పడకుండా రైతాంగాన్ని కాపాడాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ పంట గిట్టుబాటు ధర చట్టాన్ని చేసి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహారించుకోవాలని లేదంటే ఢిల్లీ తరహా లో రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన చేయక తప్పదని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఉడుగుల రాములు, జిల్లా సహాయ కార్యదర్శి ఈక బిక్ష, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఉమ్మగాని సత్యం, జిల్లా నాయకులు బూర్గుల మోష, వినోద తదితరులు పాల్గొన్నారు.. స్పందించిన అడిసినల్ కలెక్టర్ ప్రభుత్వం కు తెలియజేస్తానని హామీ ఇచ్చారు .

# సింగరేణి అప్రెంటిస్ గిరిజన బాలిక మృతిపై సమగ్ర విచారణ జరపాలి

**- మహాశక్తి ఆర్గనైజేషన్ అధ్యక్షులు మాలోత్ దిలీప్ కుమార్**

**తొలిసమయం, కొత్తగూడెం, జూన్ 08 :**



సింగరేణి సంస్థలో అప్రెంటిస్‌గా పనిచేస్తున్న గిరిజన బాలిక అనుమానాస్పద మరణ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మహాశక్తి ఆర్గనైజేషన్ అధ్యక్షులు మాలోత్ దిలీప్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మొదటగా స్పందించిన సంస్థగా మహాశక్తి ఆర్గనైజేషన్ నిలిచిందని, తమ స్పందన అనంతరం పలు గిరిజన ఉద్యోగ సంఘాలు, సామాజిక సంస్థలు కూడా ఈ అంశంపై స్పందించడం ప్రారంభించాయని ఆయన తెలిపారు. ఒక గిరిజన బాలిక ప్రాణం కోల్పోయిన ఈ విషాద ఘటనను సాధారణ మరణంగా పరిగణించకుండా, ఆమె మృతికి దారితీసిన పరిస్థితులను అన్ని కోణాల్లో విచారించాలన్న ఆయన ఈ సంఘటనకు సంబంధించి పూర్తి నిజాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం, గిరిజనులపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడం ప్రతి ప్రజాస్వామ్యవాద సంస్థ బాధ్యతన్నారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం, ఆర్థిక సహాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ ఘటనకు సంబంధించి త్వరలోనే సంబంధిత అధికార సంస్థలు, కమిషన్లు మరియు ఇతర తగిన వేదికల్లో ఫిర్యాదులు, కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపిన ఆయన బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిలో పూడిక తీత, డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించిన కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్

**తొలిసమయం, కొత్తగూడెం, జూన్ 8 :**





కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలోని అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్ వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మేయర్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పూడిక తీత, డ్రైనేజీ క్లీనింగ్ పనులు చేపట్టి, నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించే చర్యలను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను తక్షణమే పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రాధాన్యత అని తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే మేయర్ చొరవను స్థానికులు అభినందించారు. ప్రజల పట్ల ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధ, బాధ్యతాయుతమైన వ్యవహారశైలిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బండి నర్సింహా, దావూద్, దాసరి శ్రీనివాస్, 52వ డివిజన్ కార్యదర్శి ధనరాజ్, మున్సిపల్ ఏఈ శ్రీకాంత్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల భద్రతే సమాజ భద్రత గ్రామసభలో పాల్గొన్న ఎస్సై హిమబిందు





**తొలి సమయం శ్రీరంగాపూర్ జూన్ 8**

భరోసా, షీటీమ్, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిర్మూలనపై విలువైన సూచనలుప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వెంకటాపూర్ గ్రామ సభలో ఎస్సై హిమబిందు అవగాహన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా వనపర్తి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా, సోమవారం శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు పాల్గొని ప్రజలకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్. ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, భరోసా కేంద్ర సేవలు, షీటీమ్ సేవలు, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, లింగ సమానత్వం, పోక్సో చట్టం తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి ప్రవర్తన, స్నేహితుల వర్గం, ఆన్‌లైన్ కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత లింకులు, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరికీ వెల్లడించరాదని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని వివరించారు. మహిళలు లేదా బాలలు ఎలాంటి వేధింపులకు గురైనా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని, బాధితులకు భరోసా కేంద్రం ద్వారా చట్టపరమైన, మానసిక మరియు సామాజిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. పోక్సో చట్టం కింద నేరాలకు విధించే కఠిన శిక్షల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు అత్యవసర సేవల కోసం అందుబాటులో ఉన్న 100, 181, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యతను వివరించి, అవసరమైన సందర్భాల్లో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణంగ్రామాల్లో మహిళలు, పిల్లలు, యువత సురక్షితంగా ఉండే వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, సమాజ అభివృద్ధికి ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై హిమబిందు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ సర్పంచ్, భారతి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతీ యువకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక శిక్షణ

**రేగళ్ల ఆగ్రో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు, సర్పంచ్ లావుడ్య పూర్ణ**




**తొలిసమయం, పటాన్‌చెరు, జూన్ 8 :**




పటాన్‌చెరువులోని ఐసీఆర్ఐశాట్ () ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సహకారంతో ఆగ్రో రైతు సేవా కేంద్రాల నిర్వాహకులకు జూన్ 8, 9 తేదీలలో రెండు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భూసార పరీక్షల ప్రాముఖ్యత, భూమి సారాన్ని బట్టి ఎరువుల వినియోగం, వ్యవసాయ వ్యయాన్ని తగ్గించి దిగుబడిని పెంచే ఆధునిక సాగు పద్ధతులు, నూతన వంగడాలు, మార్కెట్‌కు అనుకూలమైన లాభదాయక పంటల ఎంపిక తదితర అంశాలపై శాస్త్రవేత్తలు, పరిశోధకులు సమగ్ర అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన సెమినార్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ఆగ్రో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు, రేగళ్ల పెద్దతండా గ్రామపంచాయతీ సర్పంచ్ లావుడ్య పూర్ణ పాల్గొని మాట్లాడారు. రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు శాస్త్రీయ వ్యవసాయ విధానాలను కూడా అవలంబించాలని సూచించారు. భూ సార పరీక్షలు చేయించుకోవడం ద్వారా అవసరమైన మోతాదులోనే ఎరువులు వినియోగించి సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని, తద్వారా దిగుబడులు పెరిగి రైతుల ఆదాయం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే శాస్త్రవేత్తలు సూచిస్తున్న కొత్త వంగడాలు, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రాంత రైతులకు చేరవేసి, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతలను విస్తృతంగా ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని లావుడ్య పూర్ణ తెలిపారు. శాస్త్రీయ వ్యవసాయం రైతు అభివృద్ధికి బలమైన పునాది. భూ సార పరీక్షతో ప్రారంభమయ్యే ప్రతి అడుగు రైతు ఆదాయాన్ని పెంచే దిశగా ముందుకు తీసుకెళ్తుంది" అని ఆయన పేర్కొన్నారు.